
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 20 నవంబరు 2025



చాపర పెట్రోల్ బంక్‌లో మోసం




- లీటర్ డీజిల్‌పై రూ.10 పైగా అదనం
- వినియోగదారుల ఆందోళన
- అనేకచోట్ల అదే తంతు
- తనిఖీల ఊసెత్తని అధికారులు

6లో

టెక్ శంకర్ ఎన్‌కౌంటర్

- మారేడుమిల్లి అడవుల్లో నేలకొరిగిన బాతుపురం బిడ్డ
- 1988లో ఉద్యమబాటపట్టి అజ్ఞాతంలోకి..
- మావోయిస్టు పార్టీలో కీలకనేతగా ఎదిగిన వైనం
- స్వగ్రామంలో విషాదఛాయలు



బాతుపురం గ్రామం




మెట్టూరు జోగారావు ఇల్లు

శ్రీకాకుళం/వజ్రపుకొత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరిసీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ (56) మృతి చెందారు. ఈ విషయాన్ని ఆ జిల్లా ఎస్పీ బర్దన్‌తో పాటు ఇంటలిజెన్స్ డీజీపీ మహేష్ చంద్రనడ్డా ప్రకటించారు. మెట్టూరు కామయ్య, చిన్నపిల్ల దంపతులకు ఆరుగురు సంతానం. వీరిలో జోగారావు మూడో సంతానం. తండ్రి కామయ్య చాలా ఏళ్ల కిందట మృతిచెందగా, తల్లి చిన్నపిల్లమ్మ రెండునెలలు కిందట చనిపోయింది. పదో తరగతి వరకు చదువుకున్న జోగారావు గ్రామంలో చురుగ్గా ఉండేవారు. 1988లో పీపుల్స్ ఉద్యమానికి ఆకర్షితుడై మావోయిస్టు పార్టీలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లో కీలక నేతగా మారారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జోగారావు ఇంటికి రాలేదని గ్రామస్థులతో పాటు బంధువులు చెబుతున్నారు. జోగారావును జనజీవన స్రవంతిలో కలిసిపోయేలా చూడాలని గతంలో జిల్లా ఎస్పీలుగా పనిచేసిన అమ్మిరెడ్డి, రాధికతో పాటు పలువురు పోలీస్ అధికారులు జోగారావు కుటుంబ సభ్యులను కలిసి చెప్పారు. అయినా జోగారావు మాత్రం అండర్ గ్రౌండ్‌లో ఉండిపోయారు. మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జోగారావు మృతి చెందినట్లు పోలీసు అధికారులు ప్రకటించిన నేపథ్యంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు, అమరవీరుల బంధుమిత్రులు, కమిటీ ప్రతినిధులు బాతుపురంలోని జోగారావు ఇంటికి చేరుకుని తమ సంతాపం ప్రకటించారు. అయితే, ఆయన మృతిపై కుటుంబసభ్యులకు అధికారికంగా సమాచారం (మిగతా 6వ పేజీలో..)



టెక్ శంకర్ మృతదేహం



జోగారావు అలియాస్ టెక్ శంకర్ (ఫైల్)

గంజాయితో ఒకరి అరెస్టు

- మరొకరు పరార్ ● 28 కేజీల సరుకు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ముంబాయికి గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరిలో ఓ వ్యక్తి పోలీసులకు పట్టుబడగా, మరొక వ్యక్తి పరారయ్యాడు. 28కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ వివరాలను స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నమనాయుడు విలేకరులకు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా మోహన్ బ్లాక్ బాహూజీ నగర్ వీధికి చెందిన అమిలైసా పాణి, గంజాయి వ్యాపారి ధీరజ్ అలియాస్ ధరమ్ బీర్‌నాయక్ కలిసి ఒడిశా కొండ ప్రాంతంలో 28 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. ఈగంజాయిని రైలులో తరలించి దాదర్ రైల్వేస్టేషన్‌లో ముంబాయిలోని కోపర్ కర్నే ప్రాంతానికి చెందిన ఇంగెలే రామేశ్వర్ అనే వ్యక్తికి ఇచ్చేందుకు ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ధీరజ్ టికెట్ తీయడానికి వెళ్లగా, అమిలైసా పాణి అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు పట్టుకుని విచారించారు. ఆయన బ్యాగును తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. దీంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ధీరజ్ మాత్రం పరారయ్యాడు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- పంట మార్పిడితో లాభాలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు
- 'అన్నదాత సుఖీభవ' రెండో విడత నిధులు జమ

నరసన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో నూతన విధానాలు అవలంబించి అధికదిగుబడులు సాధించాలి. వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది.'అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం రెండో విడత కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తున్నారని, దీనివల్ల గిట్టుబాటురాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని సూచించారు. మొక్కజొన్న సాగుతో ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చునన్నారు. ఉద్యానవన పంటలతో పాటు వాణిజ్య పంటలను సాగు చేస్తే ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. యాంత్రీకరణ సాగుతో దిగుబడులను సాధించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందజేస్తుందని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో 2.79 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.184కోట్లు (మిగతా 6వ పేజీలో..)



అన్నదాత సుఖీభవ పథకం చెక్కును రైతులకు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రైతులకు ఎంతో ప్రయోజనం



మా ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులు పడడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. పంట నష్టం ఎదుర్కొంటున్న మాలాంటి వారికి పెట్టుబడి కింద ఎటువంటి హామీలు లేకుండా నగదు ఖాతాలో జమ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. ప్రభుత్వం ముందుచూపు వల్ల ఎంతో మంది రైతులకు ప్రయోజనం చేకూరుతోంది.

-బి.విజయ్‌కృష్ణరాజు, రైతు, జయకృష్ణపురం, పలాస మండలం

నిధులు ఉపయోగపడుతున్నాయి



నేను రెండు ఎకరాలలో వరి సాగుచేస్తున్నాను. మొదటి విడత ఇచ్చిన అన్నదాత సుఖీభవ నిధులను ఎరువులు కొనుగోలుకు వినియోగించాను. చాలా ఉపయోగపడింది. ఇప్పుడు జొన్నసాగుకు అవసరమైన పెట్టుబడికి ఉపయోగపడుతుంది. చాలా ఆనందంగా ఉంది.

-పసల పాపారావు, రైతు, తీమర, పాతపట్నం మండలం

అవినీతి రిజిస్ట్రేషన్!

- అక్రమాలకు అడ్డగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు
- చేయి తడిపితే చాలు అన్ని రకాల రిజిస్ట్రేషన్లు
- ఏడాదిగా జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీ
- పర్యవేక్షణ అంతంతమాత్రమే



శ్రీకాకుళం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రేషన్ శాఖపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చేయి తడిపితే చాలు అన్ని రకాల రిజిస్ట్రేషన్లు జరిగిపోతాయనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు 13సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, దాదాపు అన్ని కార్యాలయాల్లో కూడా అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పొజిషన్ సర్టిఫికెట్‌ను తహసీల్దార్ ఇవ్వాలి. కానీ, గ్రామాల్లో వీఆర్వోల నుంచి బడానాయకులు, ప్రముఖులు పొజిషన్ సర్టిఫికెట్‌ను తీసుకుంటున్నారు. దానిని సమర్పించి భూముల రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఏదైనా సమస్య వస్తే డాక్యుమెంట్ రైటర్లు, దళారులు రంగప్రవేశం చేసి తమ పని కానిచ్చేస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఏడాది నుంచి ఖాళీగా ఉండడంతో రిజిస్ట్రేషన్లను పర్యవేక్షించేవారు కరువయ్యారు. దీంతో అక్రమ రిజిస్ట్రేషన్లు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి.

జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ తీరు..

జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. అలాగే, శ్రీకాకుళం, ఆమదాలవలస, హిరమండలం, ఇచ్ఛాపురం, కాశీబుగ్గ, కోటబొమ్మాళి, మందస, నరసన్నపేట, పాతపట్నం, పొందూరు, రణస్థలం, సోంపేట, టెక్కలిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి రూ.200 కోట్ల పైబడి ఆదాయం ప్రభుత్వానికి (మిగతా 6వ పేజీలో..)

●కాశీబుగ్గకు చెందిన కణితి దామోదరరావు అనే కాంట్రాక్టర్ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో రహదారులు, కాలువ పనులు చేపట్టేందుకు టెండర్లు దక్కించుకుని ఆ పనులు పూర్తి చేశాడు. రెండేళ్లవుతున్నా ఆయనకు బిల్లులు చెల్లించలేదు. ఈ పనుల కోసం ఆయన లక్షల రూపాయలు అప్పుచేసి పెట్టుబడి పెట్టాడు. వాటికి వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాడు. బిల్లుల కోసం ఇంజనీరింగ్ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు.



బిల్లులు ఎప్పుడిస్తారో?

- 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టిన పనులు
- రూ.కోట్లలో బిల్లులు పెండింగ్ ● కాంట్రాక్టర్లకు తప్పని ఎదురుచూపు

పలాస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒక్క దామోదరరావే కాదు జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు అందరూ బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టినా పనులకు నేటికీ బిల్లులు అందకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చివరి సంవత్సరం నుంచి కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల కాలంలో చేసిన పనులకు గాను ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు. పైగా కొత్త అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తూ కాంట్రాక్టర్లతో బలవంతంగా పనులు చేయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.10లక్షల నుంచి రూ.కోటి వరకూ బిల్లులు పెండింగ్ ఉన్నాయి. వాటి కోసం ప్రతిరోజూ కాంట్రాక్టర్లు ఇంజనీరింగ్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎంఎస్ఎఫ్ ద్వారా బిల్లులు ఇచ్చేవారు. అయితే చివరి ఏడాది చేపట్టిన పనులకు సంబంధించి రూ.కోట్లలో బకాయిలు ఉండిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాంట్రాక్టర్లకు రూ.కోట్లలో బకాయిలు ఉన్న విషయాన్ని గుర్తించి, వాటిని దపదపాలుగా (మిగతా 6వ పేజీలో..)





పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కార్యాలయం

కిడ్నీ వ్యాధిపై అన్వేషణ

- రంగంలోకి దిగిన ఐసీఎంఆర్
- ఉద్దానంలో పరిశోధనకు ఆమోదం
- మూడు దశల్లో రూ.6.2 కోట్ల విడుదలకు అంగీకారం



పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం

పలాస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):ఉద్దానంలో కిడ్నీ వ్యాధి సమస్యను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం మూడేళ్ల పాటు ఉద్దాన ప్రాంతంలో పరిశోధనలు చేయడానికి ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ప్రకటించారు. దీనికోసం మొత్తం మూడు దశల్లో రూ.6.2 కోట్ల నిధులు ఇచ్చేందుకు ఐసీఎంఆర్ అంగీకరించింది. దీంతో ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాలపై అన్వేషణ పూర్తిస్థాయిలో జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధిపై విదేశీ నిపుణుల బృందం పరిశోధనలు చేస్తోంది. జార్జ్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు ఇప్పటికే తమ బృందాల ద్వారా పరిశోధనలు చేయడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తాజాగా ఐసీఎంఆర్ కూడా రంగంలోకి దిగడంతో కిడ్నీ వ్యాధి మూలాలు పూర్తిగా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, నెఫ్రాలజిస్టు డాక్టర్ రవిరాజ్ బృందం ఉద్దానంలో కిడ్నీ వ్యాధులపై పూర్తి అవగాహన కలిగి ఉండడంతో ఆయన మార్గదర్శకత్వంలో పరిశోధనలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆంధ్ర వైద్య కళాశాల నెఫ్రాలజిస్టు ప్రొఫెసర్ ప్రసాద్‌తో కూడిన వైద్య బృందం రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే అనేక ప్రతిపాదనలు పంపించింది. కిడ్నీ వ్యాధుల మూలాలపై గతంలో మొత్తం లక్షకు పైగా శ్యాంపిల్స్ సేకరించారు. అందులో 25వేల మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతు న్నట్లు గుర్తించి వారికి ప్రభుత్వం అత్యవసర చికిత్స అందిస్తుంది. ప్రస్తుతం (మిగతా 6వ పేజీలో..)

కబళించిన కిడ్నీ వ్యాధి

- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- నెల కిందట అనారోగ్యంతో భార్య కూడా..



భాస్కరరావు (ఫైల్)

సోంపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తోటూరు గ్రామానికి చెందిన కోనేటి భాస్కరరావు (50) అనే వ్యక్తి కిడ్నీ వ్యాధితో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. భాస్కరరావు పలాస కిడ్నీ ఆసుపత్రిలో గత కొద్ది నెలలుగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. మంగళవారం పరిస్థితి విషమించడంతో ఆసుపత్రి నుంచి ఇంటికి పంపించేశారు. భాస్కరరావు భార్య గత నెల 24న అనారోగ్య కారణాలతో మృతి చెందింది. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు కిశోర్ మానసిక దివ్యాంగుడు. కుమార్తెకు వివాహమైంది.

లైంగిక వేధింపుల నిరోధం అందరి బాధ్యత

- చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం
- ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

7లో



ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు

- రూ.కోటి ఆస్తిని కాపాడిన మునిసిపల్ అధికారులు

6లో

రెండు నెలల్లో కార్గిల్ పార్కు పనులు పూర్తి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

7లో

మెరుగైన పునరావాసం కల్పిస్తాం

- ఉప్పుటేరు వంతెన నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సహకరించండి
- ఎమ్మెల్యే గౌతు శిరీష ● నువ్వలరేవు గ్రామస్థులతో సమావేశం

8లో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులను బుధవారం రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రైతులకు సంబంధిత చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతల మోముల్లో సంతోషం

- సందడిగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు విడుదల
- చెక్కులు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న విప్ అశోక్

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

- ప్రభుత్వ విప్ అశోక్

కంచిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా చీడపీడల నుంచి రక్షణ పొందుతూనే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కంచిలి మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం నిర్వహించిన రైతు సంబర సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంచిలి మండలానికి చెందిన 8,864 మంది రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు రూ.443.2 లక్షలు, పీఎం కిసాన్ మొత్తం రూ.121.44 లక్షలు జమ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ మొత్తంపై 30,634 మంది లబ్ధిదారులకు రూ.1971.58 లక్షలు విడుదల చేసినట్టు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అధికారులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, డుమా పీడీ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి.సుధాకర్, వ్యవసాయ శాఖ ఏడీ టి.భవానీ శంకర్, ఉద్యానవన శాఖాధికారి మాధవీలత, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం

- ఎమ్మెల్యే గౌతు శిరీష



లబ్ధిదారునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

హరిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా మందస మండలం బోగాపురం గ్రామంలో బుధవారం రైతులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. వరిపంట కోతల సమయంలో పెట్టుబడి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్కో రైతు ఖాతాలో రూ.7వేలు చొప్పున జమ చేస్తున్నట్లు చెప్పారు. పథకం అందని రైతులు సచివాలయాలు, వ్యవసాయ అధికారుల వద్ద సాంకేతిక లోపాలుంటే సరిదిద్దుకోవాలని సూచించారు. పార్టీలకు అతీతంగా ప్రతి రైతుకూ చేయూతనందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

టెక్కలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ వేపాడ చిరంజీవిరావు అన్నారు. బుధవారం స్థానిక ఆదిత్య కల్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధులు రైతులకు జమ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలో 42వేల మంది రైతులకు రూ.28కోట్ల47లక్షలు అందనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, కింజరాపు హరిప్రసాద్, బోయిన గోవిందరాజులు, పినకాన అజయ్‌కుమార్, బోయిన రమేష్, హనుమంతు రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సాయం అందాలి



చెక్కును అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల

బూర్జ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం అందేలా చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ అధికారులకు సూచించారు. పెద్దపేట రైతు సేవా కేంద్రంలో ఆమదాలవలస నియోజకవర్గ స్థాయిలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీరుకట్ల మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 33,052 మంది రైతులకు రూ.2194.92 కోట్లు జమ చేసినట్టు చెప్పారు. బూర్జ మండలంలో 7,732 మంది రైతులకు రూ.508.68 కోట్లు జమయినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణనాయుడు, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, వ్యవసాయశాఖ ఏడీ కృష్ణారావు, ఎంపీడీవో తారాపతిరావు, తహశీల్దార్ పద్మావతి, వ్యవసాయాధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

మండలంలోని పెద్దపేట సచివాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. దళారుల బారిన పడకుండా ప్రతి ఒక్క రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతు ప్రయోజనాలకు పెద్దపీట

- ఎంపీ కలిశెట్టి



రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నట్టు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఎచ్చెర్లలో బుధవారం నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును అన్ని విధాలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ ఉద్యానవన పంటలు సాగుచేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రత్యేకాధికారి పి.సుగుణాకరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 48,103 మంది రైతుల ఖాతాల్లో రూ.31.58 కోట్లు జమ అవుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, వ్యవసాయ శాఖ ఏడీ వి.శ్రీనివాస్, ఎంపీడీవో ఎస్.హరిహరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు, కూటమి నేతలు విశ్వక్సేన్, బెండు మల్లేశ్వరరావు, సంపతిరావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గొండు శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ నిధులను రైతులకు ఖాతాల్లోకి విడుదల చేసిన సందర్భంగా బుధవారం బూరవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. అనంతరం రైతులకు విత్తనాల మినీ కిట్లను ఎమ్మెల్యే శంకర్ పంపిణీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మల్ల అబ్బాయినాయుడు, తేజేశ్వరరావు, పంది యోగేశ్వరరావు, డాక్టర్ సింధూర, జగపతిరావు, భాస్కరరావు, వ్యవసాయ శాఖ ఏడీ బగ్గు రజని, ఏవోలు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

అన్నదాతలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతన్నకు అన్ని వేళలా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ రైతుల కోసం వివిధ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న నిధుల విడుదల కార్యక్రమాలను భారీ తెరపై వీక్షించారు. ఆ తరువాత నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకుగానూ రూ.24.72కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కనీస వేతన మండలి అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరి శ్రీనివాసులు రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అవినీతి రిజిస్ట్రేషన్!

(ఐదో పేజీ తరువాయి)

చేకూర్చాల్సి ఉంది. ఈ విషయంలో దాదాపు 80 నుంచి 90 శాతం వరకు లక్ష్యాన్ని చేరుకుంటున్నాయి. అయితే, ఇదే స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఏడాది నుంచి డీఆర్వో పోస్టు ఖాళీ..

ఏడాది నుంచి జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉంది. విజయనగరం జిల్లా స్టాంపుల రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల రిజిస్ట్రేషన్లపై పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంటుంది. ప్రస్తుతం భూ క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. స్థిరాస్థులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారం పెరిగింది. భారీస్థాయిలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అయితే, రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకువచ్చినా అవినీతి మాత్రం తగ్గడం లేదు.

చర్యలు లేవు..

రిజిస్ట్రేషన్లలో డాక్యుమెంట్ రైటర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేరుగా డబ్బుల జోలికిపోకుండా, తెర వెనుక అధికారులకు అనుకూలంగా కొంతమంది సిబ్బందిని నియమించుకునేవారు. డాక్యుమెంట్లు సకాలంలో రిజిస్ట్రేషన్ జరగాలన్నా.. కొర్రీలు లేకుండా ప్రక్రియ పూర్తికావాలన్నా.. ముఖ్యంగా వన్‌బీ, పొజిషన్ సర్టిఫికెట్, లీగల్ హెయిర్, వివాదాస్పద సర్వే నంబర్లు.. ఇటువంటివి బయటపడకుండా చేయాలంటే కొంతసొమ్ము ముట్టజెప్పుకోవాలి. లేదంటే రోజులు గడిచినా రిజిస్ట్రేషన్లు జరగవు. దీంతో ఈ కార్యాలయాలతో సంబంధమున్నవారితో కొందరు ఒప్పందం కుదుర్చుకుని, వారిద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకుంటున్నారు. అత్యధికంగా డాక్యుమెంట్ రైటర్‌లే ఈ విధంగా బినామీలుగా వ్యవహరిస్తున్నారు. ఇటువంటివి అడ్డుకట్ట వేసేందుకు ఏసీబీ అప్పుడప్పుడు రంగంలోకి దిగేది. ఆకస్మిక తనిఖీలు నిర్వహించేది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ దాడులు జరిగినా శ్రీకాకుళం జిల్లాలో మాత్రం తనిఖీలు చేపట్టలేదు. మరోపక్క పర్యవేక్షించే అధికారి జిల్లా స్థాయిలో లేకపోవడంతో మరింత అవినీతి జరిగేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, పారదర్శకంగా స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ పనిచేసేలా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవా లని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

(ఐదో పేజీ తరువాయి)

జమైనట్లు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో రైతాంగం ఆలోచనలో మార్పు రావాలన్నారు. వరి సాగుతో పాటు అరటి, చెరకు, పామాయిల్, మొక్కజొన్న, కూరగాయాల పంటలు సాగు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారాన్ని పెంచాలన్నారు. నత్రజని వినియోగం తగ్గించాలని రైతులకు సూచించారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. వరిలో తాను ఎకరాకు 45 బస్తాలు దిగుబడి సాధించినట్లు తెలిపారు. ఏడాదికి రూ.20వేలు సాయం చేసి రైతులకు పెద్దన్నలా సీఎం చంద్రబాబునాయుడు నిలుస్తున్నారని అన్నారు. అనంతరం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం చెక్కును పంపిణీ చేశారు. మార్కెటింగ్ శాఖ క్యాలండర్‌ను అవిష్కరించారు. ముందుగా ప్రకృతి వ్యవసాయం సాగు, డ్రోన్ల వినియోగం తదితర స్టాల్స్‌ను పరిశీలించారు. రాష్ట్ర కనీస వేతన సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి వ్యవసాయశాఖ అధికారి కె.త్రినాథస్వామి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ప్రసాద్, ఆర్డీవో సాయి ప్రత్యూష, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కాళింగ, పొందరి కార్పొరేషన్ల చైర్మన్లు రోణంకి కృష్ణంనాయుడు, దామోదర నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పాగోటి ఉమామహేశ్వరి, రాగోలు వరిపరిశోధన శాస్త్రవేత్త ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు

- రూ.కోటి ఆస్తిని కాపాడిన మున్సిపల్ అధికారులు

పలాస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడిన వారిపై మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం కొరడా ఝుళిపించారు. రూ.కోటి విలువైన ఆస్తిని కాపాడి రెండు ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన పునాదులు తొలగించారు. సర్వేనెంబరు 57/1లో పది సెంట్ల స్థలాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఆక్రమించుకొని పునాదులు నిర్మించారు. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో కమిషనర్ ఇ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో మొత్తం పునాదులు తొలగించారు. ఇక్కడ ఆక్రమణలకు గురైన స్థలం విలువ రూ.కోటికి పైగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఏడాది క్రితం దీన్ని నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే సర్వే నెంబరులో మొ త్తం 90 సెంట్ల స్థలం గెడ్డపోరంబోకు భూమిగా రికార్డుల్లో నమోదైంది. ఇప్పటికే కొంతమేర ఆక్రమించి... గృహాలు కూడా నిర్మించారు. దీనిపై అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది. అదేవిధంగా నెమలికొండ దిగువన హుద్‌హుద్ గృహ సముదాయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నిర్మాణాలకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న కమిషనర్ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో ఆ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి చదును చేశారు. ప్రస్తుతం ఈ రెండు సంఘటనలు పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారాయి.



అక్రమంగా నిర్మించిన పునాదులను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

చాపర పెట్రోల్ బంక్‌లో మోసం

- లీటర్ డీజిల్‌పై రూ.10 పైగా అదనం
- వినియోగదారుల ఆందోళన
- అనేకచోట్ల అదే తంతు
- తనిఖీల ఊసెత్తని అధికారులు



పెట్రోల్ బంకులో ధరలు ఇలా...




బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

మెళియాపుట్టి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం జలగలింగుపురం గ్రామానికి చెందిన నడుమింటి సోమేశ్వరావుకు కోత యంత్రం ఉంది. బుధవారం చాపరలో గల పెట్రోల్ బంక్‌లో రూ.3,800 చెల్లించి.. డీజిల్ కొనుగోలు చేశాడు. ఈ రోజు డీజిల్ ధర రూ.98.3 పైసలు ఉండగా... రూ.110.20 తీసుకోవడంతో సిబ్బందిని ప్రశ్నించాడు. దీంతో బంక్ యజమాని, సిబ్బంది ఎదురుదాడికి దిగారు. సుమారు 4 లీటర్ల వరకు తేడా రావడంతో వాహనదారులు ఆందోళనకు దిగారు. దీంతో ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు వచ్చి వివాదం సద్దుమణిగేలా చేశారు. గత నెలలో అదే బంక్‌లో మెళియాపుట్టికి చెందిన ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంలో రెండు లీటర్ల పెట్రోలు వేయించారు. రెండు లీటర్లు 50 కిలోమీటర్లు కూడా రాకపోవడంతో ఆందోళనకు దిగాడు. దీంతో మళ్లీ పెట్రోలు ఇచ్చి.. వివాదం బయటకు రాకుండా సిబ్బంది చూసుకున్నారు. ఇలా ఎప్పటికప్పుడు ఇక్కడ మోసాలు జరుగుతూనే ఉన్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 139 పెట్రోలు బంక్‌లు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు సుమారు 5 లక్షల 30 వేల లీటర్ల పెట్రోలును వాహనదారులు వినియోగిస్తున్నారు. డీజిల్ 7 లక్షల 60 వేల లీటర్లు వరకు వినియోగిస్తున్నారు. పెట్రోలు బంకుల్లో వివిధ రకాలుగా మోసాలు జరుగుతున్నా పట్టించుకోనే నాథుడు కనిపించడం లేదు. అత్యధికంగా రాజకీయ నేతలు బంకులు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. వారు ఏ పార్టీ అధికారంలోకి వస్తే వారి చెంతకు చేరడంతో సంబంధిత అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు.



డీజిల్ కొట్టించినట్టు ఇచ్చిన రశీదు

కొన్నిచోట్ల కొలతల్లో తేడాలు ఉంటుండగా... మరికొన్ని చోట్ల కల్తీ జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. సరిహద్దు మండలాల్లో అధికంగా మోసాలు జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో మోసాలు మూడు పువ్వులు.. ఆరుకాయలుగా సాగుతున్నాయి.

ఇలా పరీక్షించుకోవాలి..

రీడింగ్‌పై అనుమానం ఉంటే నిర్వాహకుల వద్ద ఉండే ఐదు లీటర్ల కొలమానం ద్వారా పరీక్షించుకోవాలి. ప్రతి బంకులో ఫిల్టర్ పేపర్ పరీక్ష ఉంటుంది. పేపర్‌పై పెట్రోల్ చుక్కలు వేసి.. నిమిషం పాటు గాలిలో తిప్పితే తెలుపు ఎలా ఉందో అలానే ఉండాలి. అలా ఉంటే నాణ్యంగా ఉన్నట్టు లెక్క.

ఫిర్యాదు ఎలాగంటే..

బంకు యజమాన్యం పరీక్షించి... చూపకపోయినా... మోసం జరిగినట్లు గుర్తించినా అక్కడి పుస్తకంలో ఫిర్యాదు చేయొచ్చు. ఆ పుస్తకాన్ని ఇవ్వడానికి అంగీకరించకపోతే సంబంధిత ఆయిల్ కంపెనీ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు. తూనికలు, కొలతలు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

చర్యలు తీసుకుంటాం..

చాపరలోగల పెట్రోలు బంక్‌పై ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిని పరిశీలిస్తాం. తూనికలు-కొలతల అధికారులకు తెలియజేసి.. చర్యలు తీసుకుంటాం. జలగలింగుపురం గ్రామానికి చెందిన సోమేష్ నుంచి వివరాలు తీసుకున్నాం. తప్పని తేలితే బంక్‌ను సీజ్ చేస్తాం.

-బి.పాపారావు,తహసీల్దార్, మెళియాపుట్టి

చర్యలు తీసుకోవాలి

నాకు రెండు ట్రాక్టర్లతో పాటు కోత యంత్రం ఉంది. రోజూ డీజిల్ కొనుగోలు చేస్తుంటాను. ఈ రోజు రేటు రూ.98.3 ఉండగా.. రూ.110.29 తీసుకున్నారు. దీనిపై ప్రశ్నిస్తే దాడికి దిగారు. బంక్ యజమానిపై చర్యలు తీసుకోవాలి.

-సోమేశ్వరరావు, జలగలింగుపురం

అధికారుల పరిశీలన..

ఇదిలా ఉండగా.. బాధితుల ఫిర్యాదు మేరకు.. తూనికలు-కొలతల అధికారి చిన్నమ్మి, ఇండియన్ ఆయిల్ సేల్స్ మేనేజర్ రాజు చాపరలోని పెట్రోల్ బంకును పరిశీలించారు. టెక్కలి ఆర్డీవోకు నివేదికను అందిస్తామని తెలిపారు. అంతవరకు తాత్కాలికంగా అమ్మకాలు నిలిపివేయాలని బంకు నిర్వాహకులను ఆదేశించారు.

టెక్ శంకర్ ఎన్‌కౌంటర్

(ఐదో పేజీ తరువాయి)

అందలేదని బంధువులు చెబుతున్నారు. జోగారావు మృతితో బాతుపురంలో విషాదచాయలు అలముకున్నాయి.

రూ.20లక్షల రివార్డు..

బాతుపురానికి చెందిన చెల్లూరు సూర్యనారాయణ, మెట్టూరు జోగారావు మావోయిస్టు పార్టీలో కీలక నేతలుగా ఉండేవారు. జోగారావుకు అలియాస్ టెక్ శంకర్, బాబు, శివ అనేపేర్లు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. సూర్యనారా యణ కేంద్ర కమిటీలో సభ్యుడిగా ఉండగా, జోగారావు ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లో కీలకనేతగా ఉన్నారు. వీరిద్దరిపై పదేళ్ల కిందట రూ.20 లక్షల రివార్డు ఉండేని వజ్రపుకొత్తూరు పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం రివార్డు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఒకప్పుడు జిల్లాలో మావో ల ప్రభావం ఉండేది. వివిధ కారణాలతో వారిలో చాలా మంది మృతిచెందారు. మిగిలిన ఇద్దరిలో జోగారావు తాజా గా మృతి చెందారు. ఇక సూర్యనారాయణే మాత్రమే ఉన్నా రు. బాతుపురంలో మావోల సానుభూతిపరులు, బంధుమి త్రుల కమిటీ ఆధ్వర్యంలో గతంలో అమరవీరుల స్థూపం నిర్మించారు. స్థూపం ఆవిష్కరణ కార్యక్రమానికి గద్దర్‌తో పాటు అనేక మంది నాయకులు రావడంతో బాతుపురం పేరు రాష్ట్ర స్థాయిలో మార్మోగింది. అయితే ఈ గ్రామం యువత మావోయిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులు కాకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ జో గారావు, సూర్యనారాయణలు మాత్రం ఉద్యమంలోనే ఉండి పోయారు. కాగా, జోగారావు ఎన్‌కౌంటర్ విషయం తెలుసు కున్న పలువురు పౌరహక్కుల నేతలు, ప్రజాసంఘాల నాయకులు, బంధుమిత్రుల కమిటీ నాయకులు కలిసి ఆయన మృతదేహాన్ని చూసేందుకు వెళ్తున్నారు.

బిల్లులు ఎప్పుడిస్తారో?

(ఐదో పేజీ తరువాయి)

ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఆరు నెలల కిందట ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.50 లక్షల వరకూ బకాయిలు చెల్లించింది. కూటమి ప్రభుత్వం సీఎంఎస్‌ఎఫ్ ఖాతాలను పూర్తిగా రద్దు చేసి, కొత్త ఖాతాల ద్వారా నగదు చెల్లించ డానికి రంగం సిద్ధం చేసింది. మొత్తం అన్నిరంగాల్లో ఉన్న ప్రభుత్వ శాఖలను ఒకే ఖాతాకిందకు తీసుకువచ్చింది. గ్రేడింగులను విభజించి పోర్టరులో నమోదైన మేరకు వరుస క్రమంలో బిల్లులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇది జాప్యం జరుగుతుండడంతో గత 16 నెలల కాలంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేకపోతుంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో చేపట్టిన పనులన్నింటికీ బిల్లు బకాయిలు ఉన్నాయి. ఒక్క పలాస-కాశీబుగ్గలోనే రూ.2 కోట్ల మేర బిల్లులు పెండింగ్ ఉన్నాయి. దీంతో కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఇష్టపడడం లేదు. ఉన్న బిల్లులకే దిక్కులేదు, కొత్త పనులు ఏ విధంగా చేపట్టగలమని అధికారులను ప్రశ్నిస్తున్నారు. అయితే, కాంట్రాక్టర్లతో బలవంతంగా పనులు చేయి స్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై పలాస-కాశీబుగ్గ డీఈఈ కనకరాజును వివరణ కోరగా.. 'మొత్తం బిల్లుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. పోర్టర్‌లో నమోదు చేసిన మేరకు వరుస క్రమంలో బిల్లు బకాయలు నేరుగా కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి బిల్లులు వేస్తామని ప్రభుత్వం తెలిపింది. వచ్చే నెల డిసెంబరులో కొంతమేరకు ఖాతాల్లో పడే అవకాశం ఉంది.' అని తెలిపారు.

కిడ్నీ వ్యాధిపై అన్వేషణ

(ఐదో పేజీ తరువాయి)

ఐసీఎంఆర్ ప్రతిపాదనలతో ర్యాండమ్ తనిఖీలు నిర్వహించి తొలివిడతగా 5,500 మందిని ఎంపిక చేసి వారి రక్త, మూత్రం సేకరించి ఆధునిక బయోమార్కర్స్ విధానంలో పరీక్షిస్తారు. పలాస 200 పడకల ఆసుపత్రిలో, కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఇప్పటికే అనేక మంది కిడ్నీ రోగులకు డయాలసిస్ చేస్తున్నారు. అందులోనే వ్యాధి మూలాలను కనుగొనేం దుకు ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.



కళా పూర్ణోదయం లయతరంగం పుస్తకావిష్కరణ దృశ్యం

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పాత శ్రీకాకుళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న పుస్తక మహోత్సవం 9వ రోజు కొనసాగింది. కళా పూర్ణోదయం లయతరంగం పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అనంతరం ముల్లపూడి రామచంద్రరావు సత్య హరిశ్చంద్ర ఏకపాత్రాభినయం ప్రేక్షకులకు అలరించగా, నాట్య గురువు నీరజాసుబ్రమణ్యం ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గురువారంతో పుస్తక మహోత్సవం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.



రామచంద్రరావు ఏకపాత్రాభినయం





నృత్యాభినయం చేస్తున్న నీరజా సుబ్రహ్మణ్యం శిష్యులు

రెండు నెలల్లో కార్గిల్ పార్కు పనులు పూర్తి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని కార్గిల్ విక్టరీ పార్కు అభివృద్ధి పనులను రెండు నెలలో పూర్తి చేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం సాయంత్రం అసి స్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, సుడా ఈఈ పొగిరి సుగుణాకరరావుతో కలిసి జడ్పీ కార్యాలయం ఎదు ట ఉన్న హెచ్‌బీ కాలనీలోని పార్కు పనులను పరిశీలించారు. పనులు ఎంతమేరకు వచ్చాయో అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పార్కును సమతలం చేసే పనులు సాగుతున్నాయని, గడువు లోగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని వారు వివరించారు. కార్యక్రమంలో 31వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి విభూది సూరిబాబు, సకలాబత్తుల శ్రీనివాస్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్లబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్

కాస్మోపొలిటన్ క్లబ్ అభివృద్ధికి చర్యలు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ చరిత్ర కలిగిన కాస్మోపొలిటన్ క్లబ్‌ను అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకువస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరం లోని క్లబ్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లబ్‌కు ఆర్థిక సమృద్ధిని కల్పించేలా ప్రణాళిక లను సూచించారు. ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న క్లబ్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించడం ద్వారా నెలవారీ అద్దెల ఆదాయంతో క్లబ్‌ను ఆధునికీ కరించ వచ్చన్నారు గతంలో ఎంతోమంది ఐఏఎస్, ఏపీఎస్ అధికారులు బ్యాడ్మింటన్, టెన్నిస్ ఆడేందుకు ఈ క్లబ్‌కు వచ్చే వారన్నారు. మరలా ఉన్నతాధికారులు, మాజీ ఉద్యోగులు క్లబ్‌కు వచ్చేలా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. క్లబ్ కార్యదర్శి సురంగి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధం అందరి బాధ్యత

● చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం
● ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

పాత శ్రీకాకుళం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నిరోధం అందరి బాధ్యత అని, ఈ చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో లైంగిక వేధింపులను సమర వంతంగా ఎదుర్కోవడంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎక్కువగా గృహహింస కేసులు వస్తున్నాయన్నారు. రక్షణ చర్యల్లో భాగంగా విద్యార్థినులు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. మహిళలు తమపై జరుగుతున్న లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసేందుకు ధైర్యంగా ముందుకు రావాలన్నారు. జిల్లాలో వ్యవసాయం, మత్స్య, జీడి తదితర పరిశ్రమల్లో పనిచేసేందుకు వెళ్లే మహిళలు వేధింపులకు గురయ్యే అవకాశం ఉందని, అటువంటి ప్రాంతాల్లో స్థానిక ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోష్ చట్టంపై ఉద్యోగులకు కూడా అవగాహన లేదని, ఈ చట్టం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కువ మంది మహిళలు పనిచేసే చోట స్థానిక ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటయ్యేలా కలెక్టర్‌తో మాట్లాడ తానన్నారు. డా.బీఆర్ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ.. మహిళా సాధికారత ప్రారంభమైందని, వర్సిటీలో ఎక్కువ శాతం మహి ళలు ఉన్నారన్నారు. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ.. సంఘటిత, అసంఘటిత కార్మికులు పనిచేసే చోట పది మంది మహిళల కంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక కంప్లైంట్ కమిటీ లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మహిళా సీఐ నారీ మణి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో ఇబ్బందులున్నా యని పనిచేసే ప్రదేశాల్లో ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారని, పోష్ యాక్ట్‌తో స్టేషన్‌కు రాకుండా ఫిర్యాదు చేయవచ్చని, దీనిని వినియోగించుకోవాలన్నారు. 'సురక్షిత గ్రామ కార్యక్రమం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెజ్జిపురం మనోవికాస కేంద్రం అధ్యక్షుడు ప్రసాదరావు, భీమునిపట్నం ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పెంకి సురేఖ, మహిళా కమిషన్ సలహాదారు రావూరి సూయిజ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఐ.విమల, డా బీఆర్ ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ యు.కావ్యజ్యోత్స్న, ఎస్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ వనజ, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



'సురక్షిత గ్రామ కార్యక్రమం' పుస్తకావిష్కరణ చేస్తున్న మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

● న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

శ్రీకాకుళం లీగల్ నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. అంపోలులోని జిల్లా జైలును బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, పరిశుభ్రతలపై ఆరా తీశారు. న్యాయవాదిని నియమించుకొనే స్థోమత లేని ముద్దాయిలకు ఉచితంగా న్యాయసహాయం అంది స్తామని చెప్పారు. కార్యక్రమంలో జైలర్ దివాకర్ నాయుడు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

ఇందిరా గాంధీకి ఘన నివాళి

సోంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని బుధవారం పట్టణంలో నిర్వహించారు. ఇందిరమ్మ విగ్రహానికి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్ కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశాభివృద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడ్డు సర్వేశ్వరరావు, దుప్పల చలపతి రావు, ఎలమంచి కృష్ణారావు, శరత్‌చంద్ర మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నేతలు

బ్రహ్మోత్సవాల్లో శ్రీకాంత్ బృందం ప్రదర్శన



తిరుపతిలో నృత్య ప్రదర్శనలో పాల్గొన్న శ్రీకాంత్ శిష్యులు

గుజరాతీపేట. నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతిలో శ్రీకాకుళం నగరానికి చెందిన రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో 20 మంది బృందం తొలిరోజు శిల్పారామం, రెండోరోజు వాహన సేవలో పాల్గొని అన్నమయ్య కీర్తనలకు కూచిపూడి ప్రదర్శన చేశారు. వారిని టీటీడీ అధికారులు ఘనంగా సత్కరించారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న వారిలో శ్రీభాష్యం సుందర రామకౌండన్య, నేహా, హిమబిందు, చాందిని, సాహిత్య సౌమ్య, శాశ్విత ఐశ్వర్య, శ్రీకళ, లత, కాలఘ్న రామ్, లలిత, జ్యోత్స్న, శ్రీవల్లి, శ్రావణి, నేహాసిరి, భాగ్య హర్షిత, పవిత్ర, సంజన, ఘరి, విజయభాస్కర్ తదితరులున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్‌వో

జి.సిగడాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డా.కె.అనిత అన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సాయంతో ఆధునికీ కరించిన బాతువ పీహెచ్‌సీని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో మారుమూల ప్రాంతాల్లోని పీహెచ్‌సీల ఆధునికీకరణ చేపట్టేందుకు డా.రెడ్డీస్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ డైరెక్టర్ ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 18 పీహెచ్‌సీలను ఆధునికీకరించామని, మరో 6 పీహెచ్‌ల్లో పనులు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బి.అనూష, ప్రతిష్ఠాశర్మ, ఆసుపత్రి, ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డా.అనిత

శతశాతం పన్నుల వసూలు చేపట్టాలి: డీపీవో

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఇంటి, ఆస్తిపన్నులను శతశాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి కమిషనర్, తాడేపల్లి నుంచి పంచాయతీ అధికారులు, డీఎల్పీ వోలు, ఉప ఎంపీడీవోలతో బుధ వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇంటి పన్నుల వసూళ్లకు సంబంధించి డిమాండ్ నోటీసులు మాన్యువల్‌గా ఇవ్వవద్దన్నారు. పన్ను వసూ ళ్లకు సంబంధించి యజమానుల వాట్సాప్ గ్రూప్‌లకు/ఎస్ఎంఎస్‌లకు డిమాండ్ నోటీసులు పంపాలన్నారు. వసూళ్లు నగదు రూపంలో చేయవద్దని, క్యూఆర్ కోడ్/యుపిఐ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదేశాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ విషయమై ఇప్పటికే ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నామని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

ఇచ్ఛాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా స్థానిక సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సత్య వ్రతాలు నిర్వహించారు. అలాగే మందిరంలో ఆధ్యాత్మిక, సేవా, మహిళా, బాల వికాస్ కార్యక్రమాలు, భజనలు చేపట్టారు. సాయంత్రం సామూహిక సత్య వ్రతాలు, విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం చేశారు. కార్యక్రమంలో మందిరం కన్వీనర్ రఘుపాత్రుని గోపాలరావు, జనార్దన, సుబ్బారావు, పలువురు సత్య సాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు

ఇచ్ఛాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో బెల్టుషాపులు నిర్వహించినా, వాటికి ప్రోత్సహించినా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కవిటి మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన 10 మందిని బుధ వారం కవిటి తహసీల్దార్ మురళీమోహన్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. సారా, గంజాయి, కల్తీ మద్యం, ఒడిశా మద్యం విక్రయించినా, రవాణా చేసినా వెంటనే 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

శిక్షణను ఆచరణలో పెట్టాలి

ఆమదాలవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో పొందిన అంశాలను ఆచరణలో పెట్టి ప్రయో జనం పొందాలని కేవీకే ప్రోగ్రాం అధికారి కె.భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో షేడ్ నెట్ ప్రోట్రే విధానం ద్వారా కూరగాయల నారు పెంపకంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరి కుమార్ నాణ్యమైన విత్తన రకాల ఎంపిక, చీడపీడల నియంత్రణ, తాజా షేడ్‌నెట్ల ఏర్పాటు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్య క్రమంలో ఉద్యానశాఖ అధికారి కుమారి, శాస్త్రవేత్తలు సునీత, కిరణ్ కుమార్, పలువురు యువ రైతులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండ

కవిటి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గొండ్యాల పుట్టుగ గ్రామానికి చెందిన బి.రమేష్ ఒడిశాలో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 2003-04లో 10వ తరగతి చదువుకున్న అతని స్నేహితులు అండగా నిలిచారు. ఈ మేరకు మృతుడి భార్య మోహినికి రూ.66,666 నగదుతో పాటు నిత్యావసర వస్తువులను బుధవారం అందించారు. కార్యక్రమంలో పలువురు స్నేహితులు పాల్గొన్నారు.

చివరి బస్తా వరకు కొనుగోలు: అశోక్

కంచిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో రైతులు పండించిన పంట చివరిబస్తా వరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. రబీ కాలానికి అవసరమైన విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ టి భవానీ శంకర్, ఏవోలు కె.సురేష్, బి.నర్సింహమూర్తి, శ్రీదేవి, తహసీల్దార్లు ఎన్.రమేష్ కుమార్, అప్పలస్వామి, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎఫ్‌పీవో సీఈవోలు ప్రియాంక, సౌజన్య, ఉద్యానవనశాఖాధికారి మాధవీలత, కూటమి నాయకులు మాదిన రామారావు, పూర్ణ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ధాన్యం కొనుగోలుపై ఆందోళన వద్దు

ఆమదాలవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన ధాన్యం కొనుగోలుపై ఆందోళన చెంది దళారులను నమ్మి మోసపోవద్దని పీఏసీఎస్ అధ్యక్షురాలు సిమ్మ మాధవి అన్నారు. బుధవారం సైలాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కూన రవి కుమార్ ఆదేశాల మేరకు మండలంలో మరికొన్ని కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో ఎం. మోహన్‌రావు, టీడీపీ నాయకులు నూకరాజు, ఎస్.మురళీధర్, ఎ.భాస్కర రావు, టి.రాము, టి.అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షురాలు మాధవి

పది ఫలితాల్లో సత్తా చాటాలి



విద్యార్థినితో మాట్లాడుతున్న చంద్రభూషణ్

కంచిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు పొంది విద్యా ర్థులు సత్తా చాటాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ రాష్ట్ర సహాయ పరిశీలనాధికారి జి.చంద్రభూషణ్ అన్నారు. ఎంఎస్‌పల్లి ఆదర్శ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పరీక్షల నిర్వహణ, బుక్‌లెట్స్, ప్రగతి కార్డులను పరిశీలించారు. మోడల్ స్కూల్‌కి చెందిన విద్యార్థులు ఆరాధ్య పాణిగ్రాహి, రితిక బడిత్యా, యాస్మిన్ చౌదరి, మద్ది పుష్పలత హాకీటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన నేపథ్యంలో వారిని అభినందించారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టీచ్ టూల్ రీఫ్రెష్‌మెంట్ శిక్షణను పరిశీలించారు. శిక్షణాంశాలను బోధనలో ఆచరించి సత్ఫలితాలు సాధించాలని సూచించారు. ఎంఈవో ఎస్.శివరాం ప్రసాద్, హెచ్‌ఎంలు కె.ఈశ్వర రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కవిటి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ బుధవారం పరిశీలించారు. కవిటి, బొరివంక, రాజపురం, ఆర్.బెలగాం కేంద్రాలను సందర్శించి వసతులపై ఆరా తీశారు. ఎంఈవోలు ధనుంజయ మజ్జి, ఎస్.రామకృష్ణ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఏటీఎల్ వర్క్‌షాప్ ప్రారంభం

పాత శ్రీకాకుళం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరం పెద్దపాడులోని డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ గురుకులంలో జిల్లా పరిధిలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ల్యాబ్ ఇన్‌చార్జీలకు బుధవారం మూడు రోజుల వర్క్‌షాప్ ప్రారంభించారు. ఏటీఎల్ ల్యాబ్‌కు సంబంధించిన రిజిస్టర్ల నిర్వహణ, సెకండ్ ట్రెంచ్ నిధుల కోసం దరఖాస్తు విధానంపై రిసోర్స్ పర్సన్లు మార్గనిర్దేశం చేసినట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌దేవి తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమానికి డీఈవో రవికుమార్, గురుకుల సమన్వయాధికారి యశోదలక్ష్మి, ఎస్ఎస్ఏ ఏపీసీ శశిభూషణ్, ఏఎంవో సుధాకర్ తదితరులు పరిశీలించారు.

న్యూస్ బాక్స్

33 వేల మందికి 'అన్నదాత సుఖీభవ'

ఆమదాలవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధి నాలుగు మండలాల్లోని అర్హులైన రైతులకు రెండో విడత 'అన్నదాత సుఖీభవ' కింద సుమారు రూ.21.95 కోట్లు జమ అయ్యాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, పీఎం కిసాన్ రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమచేసిందన్నారు.

రుణాలను వినియోగించుకోండి

జి.సిగడాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వయంశక్తి సంఘాలకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ శాంతన్ బారక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా నిలదొక్కు కోవాలని కోరారు. తీసుకున్న రుణాలను సక్రమంగా తిరిగిచెల్లించడం ద్వారా మరలా రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రెడ్డి రామకృష్ణం నాయుడు, ఏబీడీ ఇన్‌చార్జి జయరాం, డీపీఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

ఆమదాలవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వామి తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. బీఏ పొలిటికల్ సైన్స్, బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్స్ కోర్సుల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. అడ్మిషన్లు కావాల్సిన వారు ఒరిజినల్ సర్టిఫి కెట్లతో కళాశాలలో సంప్రదిం చాలని కోరారు. వివరాలకు 9515225991, 6301183553 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బోధనా సామర్థ్యం పెంచేందుకు శిక్షణ

ఇచ్ఛాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యసన, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంపొందించేందుకు శిక్షణలు దోహదం చేస్తాయని ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం అన్నారు. మంగళవారం బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏపీఎంఎస్ ప్రిన్సిపాల్ వైకుంఠరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

● సోంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్సీలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్‌టూల్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. మాస్టర్ రిసోర్స్ పర్సన్‌లు బి.హరికృష్ణ, ఎస్.కూర్మారావు బోధనా పద్ధతులపై వివరించారు. కార్యక్రమాన్ని ఎంఈవో ఎస్.జోరాడు పర్యవేక్షించారు.

పెద్దబాణాపురం మాజీ సర్పంచ్ మృతి


దీనబంధునాయుడు (ఫైల్)

నందిగాం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పెద్ద బాణాపురం పంచాయతీ మాజీ సర్పంచ్, సీనియర్ టీడీపీ నాయకుడు పైల దీనబంధు నాయుడు అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. గత కొంతకాలంగా వృద్ధాప్యంతో పాటు అనారోగ్యానికి గురై దీనబంధునాయుడు తన స్వగృహంలోనే చనిపోయారు. ఈయన సర్పంచ్‌తో పాటు వజ్రపుకొత్తూరు వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేయడమే కాకుండా మాజీ సైనిక ఉద్యోగి కూడా. ఈయనకు భార్యతో పాటు వివాహితులైన నలుగురు కుమార్తెలు ఉన్నారు. దీనబంధునాయుడు మృతిపై టీడీపీ పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరాం, ం, బి.గిరి తదితరులు సంతాపం తెలిపారు.

తప్పుడు ఆరోపణలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోండి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గౌతు శివాజీ, వారి కుటుంబ సభ్యులపై తప్పుడ ఆరోపణలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్న మందస మండలం బేతాళిపురం గ్రామానికి చెందిన బత్తిన లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గోవిందపురం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గౌతు శివాజీ వెయ్యి ఎకరాలు సోంపేట వద్ద లాక్కున్నట్టు ఆరోపించారన్నారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ ప్రజలకు రెచ్చగొడుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. బత్తిన లక్ష్మీనారాయణపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు ఇచ్చినవారిలో గోవింద పాపారావుతో పాటు పీఏసీఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేంబాబు చౌదరి, మాజీ సర్పంచ్‌లు పోతనపల్లి సాంబమూర్తి, అంబటిరామకృష్ణ, ఆకుల పాపారావు, మాజీ కో ఆప్షన్ కె.వెంకటరమణ, వంక రామారావు, బగాది రాజారావు, మదనాల సింహాచలం, పి.బాలు ఉన్నారు.

గౌతు కుటుంబంపై విమర్శలు తగదు

హరిపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు కార్గో ఎయిర్ పోర్టును అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యే గౌతు శిరీష కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు తగదని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. మందస మండలం హరిపురం టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. థర్మల్ పవర్ ప్లాంట్ సమయంలో గౌతు కుటుంబం వెయ్యి ఎకరాల భూమి కొనుగోలు చేసినట్టు వైసీపీ నాయకుడు బత్తిన లక్ష్మీనారాయణ ఆరోపించడం తగదన్నారు. దీనిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమరి భాస్కరరావు, మంగళిపాత్రో, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

పైలట్ ప్రాజెక్టుకు డిగ్రీ కళాశాల ఎంపిక


మాట్లాడుతున్న యూనిసెఫ్ ప్రతినిధి మధుసూదనరావు

పలాస, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రేరణమిత్ర పైలట్ వర్క్‌షాప్‌నకు పలాస డిగ్రీ కళాశాల ఎంపికైంది. ఈ మేరకు బుధవారం డిగ్రీ కళాశాల ఆవరణలో రెండు రోజుల వర్క్‌షాప్‌ను యూనిసెఫ్(హైదరాబాద్) సమన్వయకర్త శేషగిరి మధుసూదనరావు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రేరణమిత్ర కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 3,4,5 తరగతి చదివే విద్యార్థులు చాలా సున్నితంగా ఉంటారని, వారిని ఎంతో ఓర్పుతో శిక్షణవైపునకు ప్రేరణ కల్పించడానికి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ కోఆర్డినేటర్ రమ, ఎంఈవో సీహెచ్ సత్యం, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఫౌండేషన్ ప్రతినిధులు, అధ్యాపకులు శ్రీనివాస్ పట్నాయక్, దీపకుమారి తదితరులు పాల్గొన్నారు.

యువతను చైతన్య పరుస్తూ..

● హర్యానా రాష్ట్ర యువకుడి సైకిల్ యాత్ర


సైకిల్‌పై యాత్ర చేస్తున్న దీపక్‌శర్మ

నరసన్నపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రం పానిపట్‌కు చెందిన దీపక్‌శర్మ అనే యువకుడు ఆపరేషన్ సిందూర్ - సంకల్ప వికిసిత్ భారత్ చార్ ధామ్ పేరిట సైకిల్ యాత్ర చేస్తూ బుధవారం జాతీయ రహదారి మీదుగా నరసన్నపేట చేరుకున్నారు. సేవా భావం, ఐక్యతా, దేశభక్తి, పర్యావరణం, ఆరోగ్యం తదితర అంశాలపై యువతను అవగాహన కల్పిస్తూ సైకిల్‌పై చార్‌ధామ్ యాత్రను చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది మే 25న ప్రారంభించిన ఈ యాత్ర ఇప్పటి వరకు 7,500 కిలో మీటర్లు పూర్తయిందన్నారు. గుజరాత్, మహరాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన దేవాలయాల సందర్శనతోపాటు మార్గమధ్యలో విద్యార్థులు, యువతను కలిసి మాటాడుతున్నట్టు తెలిపారు. ఒడిశా రాష్ట్రం పూరిలోని జగన్నాథస్వామిని దర్శించుకుని బద్రీనాథ్ చేరుకోనున్నట్టు దీపక్‌శర్మ తెలిపారు.

ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

పలాసరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని పలువురు సభ్యులు కోరారు. బుధవారం పలాస మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలంటూ పంచాయతీ కార్యాలయాలకు వెళ్లేవారికి సరైన జవాబుదారీ ఇవ్వకుండా అధికారులు పని చేస్తున్నారని, కనీసం ఏ పనులు మీద వచ్చారని అడిగే నాథుడు కరువయ్యాడని ఇంజినీరింగ్ విభాగంపై జరిగిన చర్చలో పంచాయతీ అధికారి నర్సింహమూర్తిని వైస్ ఎంపీపీ టి.శ్రీరాములు ప్రశ్నించారు. వ్యవసాయశాఖ అంశంపై ఏవో పోలారావును చినంచల ఎంపీటీసీ సభ్యుడు దుర్యోధనరావు ఈకేవైసీ అంశంపై ప్రశ్నించగా ఈ ఏడాది మండలంలో 12,613 ఎకరాలకు ఈ-క్రాప్‌లో నమోదు చేశామని చెప్పారు. ఇరిగేషన్‌శాఖ అంశంపై జేఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. లొత్తూరు వరహాలగెడ్డను అభివృద్ధి చేసేందుకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.వసంత్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మెట్ట వైకుంఠరావు, తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి, పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు పాల్గొన్నారు.

మెరుగైన పునరావాసం కల్పిస్తాం

● ఉప్పుటేరు వంతెన నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సహకరించండి
● ఎమ్మెల్యే గౌతు శిరీష
● నువ్వలరేవు గ్రామస్థులతో సమావేశం


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నువ్వలరేవు ఉప్పుటేరుపై నిర్మించిన వంతెన నుంచి నువ్వలరేవు వైపు నిర్మించనున్న అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన వారికి మెరుగైన పునరావాసం కల్పిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం ఆ గ్రామంలోని బృందావతి ఆలయంలో స్థానిక సర్పంచ్ పూర్ణ అధ్యక్షతన నిర్వాసితులు, గ్రామస్థులతో పలాస ఆర్డీవో జి.వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్యే గౌతు శిరీష సమావేశమయ్యారు. వంతెన నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి నిధులు ఉన్నందున గ్రామస్థులు సహరించాలని కోరారు. అందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం వివరించారు. అలాగే వంతెన నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో మరిన్ని మౌలిక సదుపాయాలు పెరుగుతాయన్నారు. ఏడేళ్ల కిందట తన తండ్రి గౌతు శివాజీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.50 కోట్లతో ఉప్పుటేరుపై వంతెన నిర్మాణం చేశారని, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఉన్న మంత్రి అప్పలరాజు పట్టించుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఇప్పుడు ఈ వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మించి పనులు పూర్తిచేయాలనే తలంపుతో ఉన్నందున గ్రామస్థులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం మరింత పెంచాలని నిర్వాసితులు కోరగా.. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో నిర్వాసితులు తమ ఇళ్ల తొలగింపునకు అంగీకరించారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు అందించే ఆర్థిక సాయం, ఇంటి స్థలం కేటాయింపు వివరాలు ఆర్డీవో వెంకటేష్ వివరించారు. నిర్వాసితుల జాబితాలో ఉన్న వారు రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు జెరాక్స్‌లు అందిస్తే ఆరు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. అంతకుముందు గ్రామదేవత బృందావతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కణితి సురేష్, మాజీ చైర్మన్ దువ్వాడ హేంబాబుచౌదరి, తహసీల్దార్ సీతారామయ్య, ఆర్‌అండ్‌బీ ఏఈఈ జగదీష్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్, మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, మాజీ కో ఆప్షన్ సభ్యులు వెంకటరమణ, నెయ్యల సూర్యనారాయణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ విఠల్ పాల్గొన్నారు.

పాలిథిన్ నిషేధంపై అవగాహన పెంచండి


కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

పాతపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పాలథిన్ నిషేధంపై క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించాలని జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని కాగువాడలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగం ఉండిపోకుండా పూర్తిస్థాయిలో వినియోగానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే తడి, పొడి చెత్తల సేకరణ సంపద తయారీ కేంద్ర నిర్వహణపై అవగాహన కలిగించాలన్నారు. సీజనల్ వ్యాధాలు ప్రబల కుండా అవసరమైన పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి సర్పంచ్ నల్లి జగదీశ్వరరావు, కార్యదర్శి సమత తదితరులు పాల్గొనారు.

స్వామిత్వతో భూమిపై హక్కులు


అన్నా క్యాంటీన్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కోటబొమ్మాళి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు తమ ఆస్తులపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం స్వామిత్వ పథకం తీసుకువచ్చిందని ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ అన్నారు. బుధవారం మండలంలో గల గంగరాం పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరావు, గ్రామ పెద్దలు పేడాడ వెంకటరావు, టీడీపీ నేతలు వీరఘట్టపు శివరాం, ఎం.ప్రకాష్, లండ వసంతరావు, కె.అప్పన్న తదితరులు ఉన్నారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్‌ను ఎంపీడీవో ఫణీంద్రకుమార్ పరిశీలించారు.

రోడ్డు పక్కనే చెత్తకుప్పలు


రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు

ఎల్ఎన్ పేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీనర్సుపేట జంక్షన్ నుంచి ఆ గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనే చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసనలు వెద జల్లుతుండడంతో ఈ రోడ్డుగుండా పలు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుగుండా పెద్దకోట, బసవరాజుపేట, మిరియా పల్లి, వాడవలస, దబ్బపాడు గ్రామాలవారు నిరంతరం ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు గుండా నడిచి వెళ్లేవారితోపాటు రోడ్డుకు ఇరువైపుల పొలం పనులు చేసుకొనేవారు ఈ చెత్తకుప్పలతో ఇబ్బందిపడుతున్నారు. ఈ సమస్యపై అధికారుల దృష్టి తీసుకెళ్లినా ఫలితం లేకపోతుందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు చీరలు అందజేత

పలాస, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంతుత్సవాల సందర్భంగా స్థానిక సత్యసాయి మందిర నిర్వాహకులు బుధవారం బీదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందిర కన్వీనర్ ఐ.తిరుమలరావు మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ సత్యసాయి సూక్తిని పాటిస్తున్నామన్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో బీదలకు గుర్తించి భక్తుల ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మల్లా శరత్, జోకి జగదీష్, వైశ్యరాజు రఘురామ్, కొండలరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

జలుమూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం, పరిసరాలు పరిశుభ్రత బాధ్యత పంచాయతీ కార్యదిర్శతో పాటు సచివాలయ సిబ్బందిపైన ఉందని ఎంపీడీవో బి.చిన్నమ్మడు అన్నారు. టెక్కలిపాడు గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ప్రతీ రోజూ గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజానీకానికి అందుబాటులో ఉండాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపైనే ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తొలగిన తాగునీటి సమస్య

నందిగాం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దిమ్మిడిజోల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తాగునీటి సమస్య తొలగింది. పాఠశాలలో బోరు పాడవడంతో స్థానిక సర్పంచ్ సలాన దేవమ్మ, టీడీపీ నాయకులు సలాన కృష్ణారావు చొరవతో ఎంపీ ల్యాడ్ నిధులు, పంచాయతీ నిధులతో బోరు ఏర్పాటు చేసి మోటారు బిగించడంతో బుధవారం నుంచి ఈ సమస్య పరిష్కారమైంది. దీంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీకార్యదర్శి కె.సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సెలవుపై కొత్తూరు తహసీల్దార్

● నిలిచిన ధ్రువపత్రాల జారీ ● ఇబ్బందిపడుతున్న ప్రజలు

కొత్తూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పలు అభియోగాలు, ఆరోపణలు రావడంతో ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు తహసీల్దార్ కొప్పల బాలకృష్ణపై దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో మండలంలో వివిధ రకాలు ధ్రువ పత్రాల జారీ నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజులుగా తహసీల్దార్ సెలవులో ఉండగా.. ఎవరికి ఇన్‌చార్జి బాధ్యతలు, అధికారికంగా డిజిటల్ సైన్ అనుమతలు ఇవ్వకపోవడంతో వివిధ గ్రామాలకు చెందిన సుమారు 300 విద్యార్థుల ధ్రువ పత్రాల జారీ నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నత చదువులకు, వివిధ రకాల ఉద్యోగ ప్రయత్నాలకు ప్రయిత్నించే విద్యార్థులకు కుల, ఇతర ధ్రువ పత్రాలు కావల్సి ఉన్న, సచివాలయాలు ద్వారా నమోదైన పత్రాలు డిజిటల్ సైన్ లేకపోవడం సర్టిఫికెట్లు జారీ ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి సర్టిఫికెట్ల జారీపై దృష్టి సారించాలని మండల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి


మాట్లాడుతున్న టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన

పోలాకి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి మందిరంలో బుధవారం భగవాన్ సత్యసాయి శతజయంతి వేడుకలను పురస్కరించుకుని భక్తకమిటీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత సత్యసాయి పూజ, నగర సంకీర్తన, 40 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు, ముగ్గురు మహిళలకు ఉచితంగా టైలరింగ్ మిషన్, రక్తదాన శిబిరం, నరసన్నపేట రామదాస్ ట్రస్ట్ తరఫున గర్భిణులకు పౌష్టికాహార కిట్లు, రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన హాజరై గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీ నాయుడు, సత్యసాయి కమిటీ ప్రతినిధులు బరాటం రామారావు, వైద్యాధికారులు విజయ్‌శ్రీనాథ్, సుమప్రియ, విస్తరణాధికారి నల్లి రవికుమార్, ఐసీడీఎస్ ఎస్‌వో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ముగ్గుల పోటీలు

పోలాకి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో 25 మంది బాలికలు పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించినట్టు హెచ్‌ఎం ఆర్.లక్ష్మి తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలకు బహుమతులు గురువారం పోలాకి శాఖా గ్రంథాలయంలో నిర్వహించనున్న ముగింపు సభలో అందచేస్తామని గ్రంథాలయాధికారికె.మానస తెలిపారు. తెలుగు పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యుదయ పోరాటాలకు సాహిత్య రూపాలే శ్రీశ్రీ కవితలు

పాతపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ పోరాటాలకు సాహిత్య రూపాలే శ్రీశ్రీ కవితలని డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ తెలుగు విభాగాధిపతి కళ్లేపల్లి ఉదయ్‌కిరణ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని సాహిత్యాభిరుచి ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డా.కె.చక్రపతితోపాటు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

పలాస, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం స్థానిక ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్ వ్యాపారసంస్థ అధినేత కోరాడ సంతోష్‌కుమార్ బుధవారం రాత్రి రూ.5 లక్షలు విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో వైశ్యసంక్షేమ సంఘం అధ్యక్షుడు డోకి నాగేశ్వరరావు, కార్యదర్శి కామేశ్వరరావు, కోశాధికారి కోట్ని శశికుమార్, గౌరవ అధ్యక్షులు మల్లా భాస్కరరావుతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

కమ్యూనిజానికి ప్రపంచంలో ఆదరణ

అరసవల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కమ్యూనిజానికి ప్రపంచంలో ఆదరణ పెరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డేగ ప్రభాకర్ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. శ్రీలంకలో, అమెరికాలోని న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో కమ్యూనిస్టులు గెలిచారని, త్వరలో నేపాల్‌లో కూడా అధికారంలోకి వస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చాపర వెంకటరమణ, ఎం. యుగంధర్, ఎల్.వెంకటరావు, చాపర సుందరలాల్, కె.శ్రీనివాస్, ఆరేలమ్మ, బి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

సరుబుజ్జిలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పరిసరాలతో పాటు గ్రామ పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో ఎం.పావని అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛభారత్ క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకుంటు న్నాయని, వీటిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బి.రామా రావు, ఏవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ జర్నలిస్ట్ ఆఫ్ ది ఇయర్‌గా సత్యనారాయణ

● వరల్డ్ ఎక్స్‌లెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు


సత్యనారాయణ

న్యూఢిల్లీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా సం తబొమ్మాళి మండలానికి చెందిన నౌపడా సత్యనారాయణను బెస్ట్ జర్నలిస్ట్ ఆఫ్ ది ఇయర్‌గా వరల్డ్ ఎక్స్‌లెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించింది. నిజాయతీతో కూడిన రిపోర్టింగ్ పట్ల సత్యనారాయణ నిబద్ధత, నైతిక జర్నలిజం పట్ల అంకితభావం, ప్రజల అవగాహన కోసం అందించిన సహకారం మీడియా కమ్యూనికేషన్ రంగంలో విశిష్ట ప్రమాణాలను నెలకొల్పాయని వరల్డ్ ఎక్స్‌లెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసించింది. ఈ మేరకు బుధవారం ధ్రువపత్రాన్ని సత్యనారాయణకు అందజేసింది. ప్రస్తుతం కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడి అదనపు వ్యక్తిగత కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ గతంలో పదేళ్లు తెలుగు మీడియాలో రిపోర్టర్‌గా విధులు నిర్వర్తించారు. కేంద్ర మంత్రిగా ఎర్రన్నాయుడు ఉన్న సమయంలో ఆయన దగ్గర ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీగా కూడా సత్యనారాయణ పనిచేశారు. సామాజిక సేవకు గుర్తింపునకు గానూ గతంలో సీఎం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి నుంచి సత్యనారాయణ రెండు సార్లు రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో ఉంటూ ఎన్డీయే కూటమి దక్షిణాది రాజకీయ మీడియా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు.

జాగ్రత్తగా ఉండాలి

టెక్కలి రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పైపులైన్ల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఐవోపీఎల్ రీజనల్ మేనేజర్ సాయికిషోర్ తెలిపారు. బుధవారం తలగాం గ్రామం వద్ద పైపులైన్లపై అవగాహన కల్పించారు. ఇండియన్ ఆయిల్‌లో ప్రమాదాలు జరిగితే ప్రజలు ఎలా తప్పించుకుని ప్రాణాలు కాపాడుకోవాలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. భూమిలోపల నుంచి వేసిన పైపులైన్ల ద్వారా సహజవాయువు, ముడిచమురుతో పాటు పెట్రోలియం వంటివి పంపించడం జరుగుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగితే, వాటి నుంచి ఎలా తప్పించుకోవాలో వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మేనేజర్ కోట దిలీప్, లక్ష్మీనారాయణ రెడ్డి, గణేష్, సింధూ, మూలపేట పోర్టు ఏఈ బానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

హరిపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసి ఆదుకుంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ రామారావు ఆధ్వర్యంలో మందస మండలం భోగాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లోనే సొమ్ములు చెల్లించే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు నాగరాజు, ఉదయ్, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, బావన దుర్యోధన, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యం పెంచుకోవాలి

టెక్కలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అభ్యాసనా సామర్థం పెంపొందించుకోవాలని ఎంఈవో డి.తులసీరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో రెండురోజుల పాటు జరిగిన టీచ్ టూల్ శిక్షణలో ఆయన మాట్లాడారు. కోర్సు డైరెక్టర్‌గా డి.చిన్నారావు, శిక్షకులుగా బి.నేతాజీ, ఎన్.సురేష్, హెచ్‌ఎం దాశరధి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

నరసన్నపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ పీవో శోభారాణి అన్నారు. బాలలు సంరక్షణ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంపీడీవో సమావేశం మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బాలల రక్షణ విభాగం అధికారులు గీత, జనర్దనరావు, ఏవో విజయానంద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఊయల కార్యక్రమంపై అవగాహన పరిచారు.

పనిముట్లు పంపిణీ

టెక్కలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా నాయిబ్రాహ్మణులకు, హస్తకళ వృత్తిదారులకు స్థానిక వెంకటేశ్వర కాలనీలో గల పోస్టాఫీస్ వద్ద పనిముట్లను పోస్టుమాస్టర్ మెండ ఉపేంద్ర ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు హనుమంతు ఉదయబాస్కర్ మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ పూర్తి చేసిన వారికి బ్యాంకులో రుణ సౌకర్యం, నాణ్యమైన పనిముట్లు, మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్నట్టు తెలిపారు. 18 విభిన్న సంప్రదాయ వృత్తుల వారికి దశ ల వారీగా తపాలాశాఖ పనిముట్లు అందిస్తుందని తెలిపారు.

పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలి

జి.సిగడాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు కె.రమణ, ఎంపీడీవో గంటముక్కల రామకృష్ణ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన నిర్వహించారు. గ్రామాల్లోని వీధులు, కాలువలు, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసే బాధ్యతను తీసుకోవాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

జలుమూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల జోనంకి ఫీడర్ మరమ్మతులు శుక్రవారం చేపడుతుండడంతో ఆ రోజు ఉదయం 9 గంటల నుచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు టెక్కలి ఈఈ నరసింహకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో అబ్బాయిపేట, జోనంకి, గంగాధరపేట, కేఎల్ఎన్ పేట, తలతరియా, లింగాలపాడు, సుబ్రమణ్యపురం, వెంకటాపురం, ఊడికలపాడు, ఎర్రన్నపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే బుడితి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున ఆ పరిధిలో గల శ్రీముఖలింగం, నగిరికటకం, అచ్యుతాపురం, మర్రివలస, కరకవలస, అంధవరం, రామకృష్ణాపురం, పర్లాం, మాకివలస, సురవరం, సైరిగాం, రామదాసుపేట, యలమంచిలి, కొమనాపల్లి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

సారవకోట మండలంలో..

బుడితి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ నరసింహకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో బుడితి, అవలింగి, చీడిపూడి, తొగిరి, కిన్నెరవాడ, బద్రి, గుమ్మపాడు, బైదలాపురం, గోపాలపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● కోటబొమ్మాళి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు టెక్కలి ఈఈ నరసింహకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి, సరియాపల్లి, కురుడు, చౌదరికొత్తూరు, దంత, నారాయణపురం, చిన్నసాన, పులిబంధ, రామ్మూర్తిపేట, కిడిమి, భద్రాచలం, జమచక్రం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

● నరసన్నపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సబ్‌స్టేషన్ ఫీడర్ -4 పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ నర్సింహకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో జమ్ము, తామరాపల్లి, జిల్లేడిమాకివలస, మాకివలస తదితర గ్రామాల్లో మెయింటెన్స్ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు.

● సోంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోంపేట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా సోంపేట, జింకిభద్ర, బెంకిలి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.